# సాక్షి ఏలూరు

ఆదివారం I 3 I మార్చి I 2024






**నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళం**

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు మతంగూడెంకు చెందిన జాస్తి మధు కేశవ కృష్ణ దంపతులు రూ.2,82,200 విరాళంగా శనివారం అందజేశారు.



**త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు**

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని జీవీ ఆర్ కళా కేంద్రంలో శ్రీత్యాగరాజస్వామి వారి ఆరాధనోత్సవాల్లో శ్రీత్యాగరాజ గాన సభ ఆధ్వర్యంలో శనివారం జరిగాయి.



**శ్రీవారి కొండపై కారులో చోరీ**

శ్రీవారి క్షేత్రానికి వచ్చిన ఓ దంపతులు స్వామి దర్శనం చేసుకుని తిరిగొచ్చేసరికి కారులో ఉండాల్సిన 17 కాసుల బంగారపు ఆభరణాలు మాయమయ్యాయి. IIలో ▸

## న్యూస్‌రీల్

### విద్యుత్, కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించండి

**పంచాయతీ కార్యదర్శులకు డీపీఓ ఆదేశం**



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్

ఏలూరు (మెట్రో): గుత్తేదారులు చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచులకు జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఆదేశాలు జారీ చేశారు. అలాగే పంచాయతీలలో పేరుకుపోయిన కరెంట్ బిల్లుల బకాయిలను కూడా చెల్లించాలని అన్నారు. జిల్లాలో 2022–2023 ఆర్థిక సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘం నిధులు రెండు విడతలుగా 545 గ్రామ పంచాయతీలకు రూ.31.65 కోట్లు జమ కాగా, 2023–2024 ఆర్థిక సంవత్సరానికి మొదటి విడతగా రూ.32 కోట్లు జమ అయ్యాయన్నారు. అయితే జమ అయిన నిధులలో కేవలం రూ.32 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, మిగిలిన రూ.31 కోట్లు పైబడి ఖర్చు చేయాల్సి ఉందన్నారు. పంచాయతీ పరిధిలో పనులు చేసిన గుత్తేదారులకు బిల్లులు రావట్లేదని ఫిర్యాదులు అందడంతో తక్షణమే కాంట్రాక్టర్లకు నిబంధనల మేరకు బకాయిలు చెల్లించాలని ఆదేశించారు. ఇప్పటికే జిల్లాలో రూ.137 కోట్ల వరకు విద్యుత్ బకాయిలు చెల్లించాల్సి ఉన్నా కేవలం రూ.54 లక్షలు మాత్రమే పంచాయతీలు చెల్లించాయని డీపీఓ గుర్తు చేశారు. త్వరలో 2023–2024 ఆర్థిక సంఘం నిధులు రెండో విడత విడుదల కానున్నాయని డీపీఓ తెలిపారు.

### టెట్‌కు 656 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయి. ఐదో రోజు శనివారం జరిగిన పరీక్షలకు మొత్తం 656 మంది హాజరయ్యారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు 365 మందికి 328 మంది హాజరు కాగా 37 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు 365 మందికి 328 మంది హాజరు కాగా 37 మంది గైర్హాజరయ్యారు.

### ఇంటర్ పరీక్షలకు 13,660 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా జరుగుతున్న థియరీ పరీక్షలు శనివారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు జరిగాయి. ఏలూరు జిల్లా వ్యాప్తంగా కేటాయించిన 51 కేంద్రాల్లో తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ–2 పరీక్షలకు మొత్తం 14,081 మంది విద్యార్థులకు 13,660 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 12,184 మంది జనరల్ విద్యార్థులకు 11,894 మంది హాజరు కాగా 290 మంది గైర్హాజరయ్యారు. అలాగే 1,897 మంది ఒకేషనల్ విద్యార్థులకు 1766 మంది హాజరు కాగా 131 మంది గైర్హాజరయ్యారు. మొత్తం విద్యార్థుల హాజరు 97 శాతంగా నమోదైంది. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల కన్వీనర్ బి.ప్రభాకరరావు తెలిపారు.

### డీఎస్సీ పరీక్షలపై సందేహాలుంటే తెలపండి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో ఏపీ టెట్, డీఎస్సీ–2024 పరీక్షలు రాసే అభ్యర్థులకు ఎటువంటి సందేహాలు ఉన్నా సంబంధిత అధికారులను ఫోన్‌లో సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అభ్యర్థులు అసిస్టెంట్ డైరెక్టర్ 94925 15116, పర్యవేక్షకుని 83281 86618, సీనియర్ అసిస్టెంట్ 9030723444 నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు. పరీక్షలు రాసే అభ్యర్థులు హాల్‌టికెట్, గుర్తింపు ఐడీతో పరీక్షా సమయానికి గంట ముందుగా చేరుకోవాలని, ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని స్పష్టం చేశారు.

# పల్లె దవాఖానా

ప్రజారోగ్యానికి జగన్ సర్కార్ పెద్దపీట వేసింది. గ్రామానికో వైద్యశాలను వైఎస్సార్ హెల్త్ క్లినిక్ పేరుతో ఏర్పాటు చేసి వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో 388 గ్రామాల్లో హెల్త్ క్లినిక్‌లకు పక్కా భవనాలను సైతం సమకూరుస్తోంది. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో కొత్త భవనాల్లో వైద్య సేవలు ప్రారంభం కాగా, మిగిలిన చోట్ల భవనాల నిర్మాణం శరవేగంగా సాగుతోంది.



లింగపాలెం మండలం కె.గోకవరంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్

- జిల్లాలో శరవేగంగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు
- మొత్తం 388 గ్రామాల్లో త్వరలో అందుబాటులోకి క్లినిక్‌లు
- ఇప్పటికే 47 చోట్ల మొదలైన వైద్య సేవలు, మరో 84 పూర్తి
- మిగిలిన నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతున్న వైనం
- ఒక్కో భవనానికి రూ.20.80 లక్షల చొప్పున కేటాయింపు

**ఏలూరు జిల్లాలో హెల్త్ క్లినిక్‌ల వివరాలు**

| | | | | | |
|---|---|---|---|---|---|
| మొత్తం భవనాలు | 388 | తుదిదశలో | 51 | బేస్‌మెంట్ లెవల్ కింది స్థాయి | 13 |
| నిర్మాణం పూర్తయి ఆరోగ్య శాఖకు అప్పగించినవి | 47 | శ్లాబ్ లెవల్‌లో | 52 | | |
| పనులు పూర్తయినవి | 84 | రూఫ్ లెవల్ | 66 | పనులు ప్రారంభించాల్సినవి | 07 |
| | | బేస్‌మెంట్ లెవల్ | 68 | | |



జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి పేద ప్రజల అవసరాలను గుర్తిస్తూ, వాటిని సఫలీకృతం చేసేందుకు నిరంతరం కృషి చేస్తోంది. వైద్యరంగంలో అనేక మార్పులు తీసుకువస్తూ నూతన ఒరవడి సృష్టిస్తోంది. ప్రతి గ్రామానికి ఒక వైద్యశాలను అందుబాటులో ఉంచేలా పట్టణ, గ్రామీణ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసిన వాటికి మౌలిక వసతులను కల్పిస్తోంది. ఇందుకోసం గ్రామీణ ప్రాంతాల్లో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం చేపట్టింది. గ్రామస్థాయిలోనే ఈ క్లినిక్‌ల ద్వారా ప్రజల వద్దకే వైద్యం అందేలా చర్యలు తీసుకుంది. ప్రధానంగా పేదవారికి వైద్య సేవలన్నీ ఇంటి ముంగిటకే అందించాలని జగనన్న సర్కారు నిర్దేశించింది. వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లి అవస్థలు పడకుండా గ్రామాల్లోనే వైద్యసేవలు అందించే లక్ష్యంతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు రూపకల్పన చేసింది. అవసరమైన సిబ్బంది నియమించేందుకు కసరత్తు చేసింది. తొలుత వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటు కోసం అందుబాటులో ఉన్న భవనాలను ఏర్పాటు చేయడంతో పాటు లేని ప్రాంతాల్లో నూతనంగా హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం చేపట్టింది. గ్రామాల్లో భవనాల నిర్మాణాలు ముమ్మరంగా సాగుతుండగా, కొన్ని గ్రామాల్లో నిర్మాణాలు కూడా పూర్తయ్యాయి. హెల్త్ క్లినిక్‌ల ద్వారా వైద్యం అందించాలనే ప్రభుత్వ సంకల్పం నెరవేర్చే దిశగా పనులు కొనసాగుతున్నాయి. పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో నిర్మాణాలు పూర్తి చేసుకుని ప్రారంభమయ్యాయి. కలెక్టర్ మొదలుకుని సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఈ క్లినిక్‌ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ఏలూరు జిల్లాలోని 28 మండలాల్లో మొత్తం 388 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు నిర్మించనున్నారు. ఈ విలేజ్ క్లినిక్‌ల నిర్మాణానికి తొలుత రూ.17.50 లక్షలు కేటాయించారు. మెటీరియల్ వ్యయం, కూలీ ఖర్చులు తదితర కారణాలతో ప్రభుత్వం మరో రూ.3.30 లక్షలు అదనంగా కేటాయించింది. దీంతో మొత్తం రూ.20.80 లక్షలను ఒక్కో క్లినిక్ నిర్మాణానికి కేటాయించారు. జిల్లాలో ఇప్పటికే 47 భవనాలు వైద్యారోగ్య శాఖకు అప్పగించగా, 84 భవనాలు నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

### భవనాల నిర్మాణాలు వేగవంతం చేశాం



లక్ష్యం మేరకు హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే 35 శాతం మేర నిర్మాణాలు పూర్తి కాగా, వివిధ దశల్లో 65 శాతం భవనాల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. బేస్‌మెంట్ స్థాయి నుంచి శ్లాబ్ స్థాయి వరకు చేరుకున్న భవనాలను ముందుగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాం. బేస్‌మెంట్ స్థాయిలో ఉన్నవి దశల వారీగా చేపట్టి నిర్మాణాలు పూర్తి చేస్తాం.

– కె.శ్రీను, ఈఈ, పంచాయతీరాజ్ శాఖ, జంగారెడ్డిగూడెం

### ఎన్నికల విధులపై అవగాహన పెంచుకోండి

**జేసీ బి.లావణ్యవేణి**



సమావేశంలో పాల్గొన్న జేసీ బి.లావణ్యవేణి

ఏలూరు (మెట్రో): ఎన్నికల విధులకు నియమితులైన సెక్టార్ అధికారులు తమ పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రాన్ని వ్యక్తిగతంగా సందర్శించి వసతులు, ప్రతికూల, అనుకూలతలను పరిశీలించాలని జేసీ బి.లావణ్యవేణి సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం సెక్టార్ ఆఫీసర్లు, సెక్టార్ పోలీస్ ఆఫీసర్లకు శిక్షణా కార్యక్రమంలో జేసీ మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులది భూమిక అన్నారు. ప్రతి ఎన్నికలను కొత్తగానే చూడాలని ఏదశలోను ఎటువంటి తప్పిదాలకు ఆస్కారం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. రిటర్నింగ్ అధికారులు సెక్టార్ అధికారులకు అనుసంధానమై ఉంటారన్నారు. సెక్టార్ అధికారులు పోలింగ్ స్టేషన్లను సందర్శించి కనీస అవసరాలను పరిశీలించాలన్నారు. పోలింగ్ ముందురోజు కూడా సంబంధిత పోలింగ్ కేంద్రాలను సందర్శించాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి మాట్లాడుతూ ఎన్నికల్లో సెక్టార్ ఆఫీసర్లు, సెక్టార్ పోలీస్ ఆఫీసర్ల పాత్ర చాలా కీలకంగా ఉంటుందన్నారు. ఎన్నికల్లో సెక్టార్ ఆఫీసర్లు ఇచ్చే సమాచారం ఎంతో ప్రధానమన్నారు. పోలవరం రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ మాట్లాడుతూ సెక్టార్ ఆఫీసర్లకు ఎన్నికల విధులపై వివరించారు. మాస్టర్ ట్రైనీ చక్రపాణి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సెక్టార్ అధికారుల విధులపై అవగాహన కల్పించారు. శిక్షణా కార్యక్రమంలో ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులైన ఆర్డీఓలు ఎన్ఎస్‌కే ఖాజావలి, వై.భవాని శంకరీ, కె.అద్దయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.ముక్కంటి, కె.భాస్కర్, కలెక్టరేట్ ఏఓ కె.కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

## 83 శాతం ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

- నేడు స్పెషల్ డ్రైవ్ ద్వారా పంపిణీ
- జగనన్న ఇళ్లు రిజిస్ట్రేషన్‌పై కూడా..
- కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ వెల్లడి



ఏలూరు (మెట్రో): ఏలూరు జిల్లాలో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ 83 శాతం పంపిణీ పూర్తయిందని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ చెప్పారు. విజయవాడ సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి శనివారం రెవెన్యూ, రీసర్వే మూడో దశ, ఇనామ్–అసైన్డ్ భూములు, హౌస్ సైట్స్ రిజిస్ట్రేషన్స్, పీఆర్డీ, ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా కరువు మండలాల్లో పని దినాల కల్పన, తాగునీరు, పరిశ్రమల శాఖలో ఎంఎస్ఎంఈ క్లస్టర్‌లకు భూకేటాయింపు, ఆరోగ్యం, వైద్యం, కుటుంబ సంక్షేమం, జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమం తదితర అంశాలపై జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్.జవహర్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏలూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కార్డులను ప్రత్యేక డ్రైవ్ చేపట్టి మిగిలినవి పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. జిల్లాకు 5,05,458 ఆరోగ్యశ్రీ కార్డులు వచ్చాయని, ఈకేవైసీ ద్వారా 4,19,964 కార్డులు పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగిలినవి త్వరితగతిన పంపిణీ చేయడానికి ప్రత్యేక డ్రైవ్ పెట్టి లబ్ధిదారులకు అందజేస్తామని వివరించారు. జిల్లాలో జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ 90 శాతం జరిగిందని, మరో 6,984 మాత్రమే పెండింగ్ ఉన్నాయన్నారు. ఇందుకు ఆదివారం కూడా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి షేక్ హబీబ్ బాషా, జిల్లా పంచాయతీ అధికారి టి.శ్రీనివాస విశ్వనాథ్, డీఎంహెచ్ఓ ఏస్.శర్మిష్ఠ, ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ డా.రాజీవ్, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## గూడెంలో త్వరలో మహిళా మార్టు

**మెప్మా మిషన్ రాష్ట్ర డైరెక్టర్ వి.విజయలక్ష్మి**



సమావేశంలో మాట్లాడుతున్న విజయలక్ష్మి

తాడేపల్లిగూడెం అర్బన్: మెప్మా నిర్వహణలో త్వరలో తాడేపల్లిగూడెంలో మహిళా మార్టును ఏర్పాటు చేస్తున్నట్లు మెప్మా మిషన్ రాష్ట్ర డైరెక్టర్ వి.విజయలక్ష్మి వెల్లడించారు. జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల ఆర్పీలతో తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయంలో శనివారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమృద్ధి యూనిట్స్, ప్రగతి యూనిట్, జగనన్న తోడు, డ్వాక్రా రుణాలు, మెప్మా బ్యాంకు రుణాలు, ఎస్‌హెచ్‌జీ రుణాలు తద్వారా చేపడుతున్న లైవ్లీహుడ్స్ తదితర ప్రభుత్వ కార్యక్రమాలు ఏవిధంగా అమలవుతున్నాయనే అంశాలపై రీసోర్స్ పర్సన్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. దీనిలో భాగంగా జూమ్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించి జిల్లాలోని ఎస్‌హెచ్‌జీ మహిళల అభిప్రాయాలను సేకరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకునే దిశగా మెప్మా అధికారులు,, ఆర్పీలు కృషి చేయాలని సూచించారు. మెప్మా పథకాల ద్వారా పొందిన లబ్ధి, ఆర్థిక పరిపుష్టిని సాధించిన వారి వివరాలు తెలుసుకున్నారు. సమృద్ధి స్కీమ్‌కు సంబంధించి రూ.27 లక్షలు తాడేపల్లిగూడెం పట్టణానికి మంజూరయ్యాయని, సమృద్ధి యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్న స్లమ్ ఫెడరేషన్లలోని ఒక్కక్కరికి రూ.50 వేలు రుణం అందిస్తామన్నారు. తాడేపల్లిగూడెంలో 50 స్లమ్ లెవెల్ ఫెడరేషన్లకు మంజూరు చేశామన్నారు. తాడేపల్లిగూడెంలో 1,850 స్వయం సహాయక సంఘాలు, ఎస్ఎల్ఎఫ్‌లు 50 ఉన్నాయన్నారు. స్టేట్ మిషన్ మేనేజర్ ఆర్.ఆదినారాయణ, ఎస్ఎస్ఆర్ శ్రీనివాస్, రంగాచారి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రామాంజనేయులు, డ్వాక్రా సంఘాల పట్టణ అధ్యక్షురాలు బోశెం రామలక్ష్మి, సిటీ మిషన్ మేనేజర్ బీహెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల తీర్చడమే లక్ష్యం

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- లబ్ధిదారులకు జగనన్న ఇంటి స్థలం హక్కు పత్రాల అందజేత



లబ్ధిదారుకు స్థలం హక్కు పత్రాలను అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు, కలెక్టర్ సుమిత్‌కుమార్

తాడేపల్లిగూడెం అర్బన్: ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల తీర్చడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. జగనన్న రిజిస్ట్రేషన్ చేయించి ఇంటి స్థలం హక్కు పత్రాలను జగనన్న కాలనీలలో ఇంటి స్థలం పొందిన లబ్ధిదారులకు శనివారం ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ చేతులమీదుగా అందజేశారు. స్థానిక ఆర్ అండ్‌బీ బంగ్లాలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్ అధ్యక్షతన హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు మాట్లాడుతూ తాను మొదటిసారిగా ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పేదలకు ఇళ్లు నిర్మించేందుకు 56 ఎకరాల విమానాశ్రయ భూమిని ఆక్రమణదారుల నుంచి విడిపించి మెరక చేసి సిద్ధంగా ఉంచామన్నారు. అనంతరం వచ్చిన రాజకీయ పరిణామాల కారణంగా ఇక్కడ ఏపీ టిడ్కో గృహాలు నిర్మించారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల్లో భాగంగా జగనన్న కాలనీలు ఏర్పాటు చేశారన్నారు. ఆ పథకంలో భాగంగా పేదలకు సొంతి ఇళ్లు ఉండాలనే అభిలాషతో ప్రతి పేద కుటుంబానికి సెంటు భూమిని ఉచితంగా ఇచ్చి ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం ఆర్థికసాయం అందించిందన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో సుమారు 5,386 స్థలాలు ఇవ్వగా, వాటిలో ప్రస్తుతం 3,600 మందికి ఇళ్ల స్థలాల హక్కు పత్రాలను అందిస్తున్నామన్నారు. ఈ పత్రాలు శాశ్వత భూహక్కు పత్రాలుగా చెలామణి అవుతాయన్నారు. ఈ హక్కు పత్రాలపై బ్యాంకు రుణాలు పొందవచ్చునని లేదా విక్రయించుకోవచ్చన్నారు. దీనిపై లబ్ధిదారునికి పూర్తి హక్కును కల్పించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు.

**విమానాశ్రయ నివాసులకు పట్టాలు**

విమానాశ్రయభూముల్లో 40 ఏళ్ల నుంచి నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నవారిలో 100 చదరపు గజాలు ఆక్రమించుకుని నివాసం ఉంటున్న వారికి పట్టాలు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని మంత్రి చెప్పారు. 100 చదరపు గజాలకు మించి ఆక్రమించుకున్న వారి స్థలాలకు ధర నిర్ణయించి పట్టాలు ఇవ్వడానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆలోచన చేస్తోందని వెల్లడించారు.

**పేదలను మోసం చేసిన చంద్రబాబు**

పేదలకు పక్కా గృహాలు నిర్మించి ఇస్తామని చెప్పిన చంద్రబాబు తన ప్రభుత్వంలో ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని ఉపముఖమంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. ఏపీ టిడ్కో గృహాలు నిర్మించే నేపథ్యంలో ప్లాటుకు రూ.2.50 లక్షల చొప్పున రూ.వేల కోట్లు దోచుకున్నాడని ఆరోపించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ మళ్లీ మోసం చేసేందుకు జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌తో కలిసి చంద్రబాబు వస్తున్నాడని ప్రజలు నమ్మవద్దని మంత్రి కొట్టు అన్నారు. అనంతరం జగనన్న కాలనీ లబ్ధిదారులకు ఇంటి స్థలహక్కు పత్రాలను మంత్రి కొట్టు, కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ పంపిణీ చేశారు. అనంతరం రెవెన్యూ సిబ్బంది మంత్రి కొట్టును సత్కరించారు. తహసీల్దార్ బండ్రెడ్డి మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్, మాజీ ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ నాయకులు పసల కనకసుందరరావు, ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, తమ్మిశెట్టి చుక్కయ్య, గుండుబోగుల నాగు, కొట్టు విశాల్ పాల్గొన్నారు.

## నిండు జీవితానికి రెండు చుక్కలు

- నేడు పల్స్‌పోలియోకు ఏర్పాట్లు పూర్తి
- డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శర్మిష్ట



ఏలూరులో ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ శర్మిష్ట , డీఐవో నాగేశ్వరరావు

ఏలూరు టౌన్: ఐదేళ్ల చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు వేసి, పోలియో రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ బాటలు వేయాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శర్మిష్ట అన్నారు. పల్స్‌పోలియోపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నగరంలో చేపట్టిన అవగాహన ర్యాలీని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగేశ్వరరావుతో కలిసి ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పల్స్‌పోలియో కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఏలూరు జిల్లాలో ఐదేళ్ల లోపు చిన్నారులు 1లక్ష 91వేల 466మంది ఉన్నారని, ఆదివారం వీరందరికీ పల్స్‌పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. తల్లిదండ్రీ బాధ్యతగా తమ బిడ్డలకు పల్స్‌పోలియో చుక్కలు వేయించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ప్రతి కూడళ్ళలోనూ నిర్దేశించిన బూత్‌ల్లోనూ పోలియో నివారణ చుక్కలు అందుబాటులో ఉంచామన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,755 బూత్‌లు ఏర్పాటు చేశామని, అందులో 7వేల 20మంది సిబ్బందిని నియమించామని చెప్పారు. రూట్ సూపర్‌వైజర్లు 175 మంది, హైరిస్క్ ఏరియాలు 283 ఉన్నట్లు గుర్తించి ఆయా ప్రాంతాల్లో చిన్నారులకు పోలియో చుక్కలు అందించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రయాణాల్లో ఉన్న వారికి సైతం అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. అవగాహన ర్యాలీ నగరంలోని పాతబస్టాండ్ సెంటర్, తదితర ప్రాంతాల్లో నిర్వహించి ఆరోగ్య సిబ్బంది పల్స్‌పోలియో ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. డీపీఎంవో డాక్టర్ విజయలక్ష్మి, డెమో నాగరత్నం, అసిస్టెంట్ మలేరియా అధికారి జే.గోవిందరావు, హెచ్ డబ్ల్యూసీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ పూర్ణచంద్రరావు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### గుంటూరు వెళ్లి పింఛన్ అందజేత



గుంటూరులో పింఛన్ అందజేస్తున్న సచివాలయ ఉద్యోగి

కలిదిండి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పని చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న విషయం అందరికీ తెలిసిందే. పడమటిపాలెం గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న దాకరపు సుధీర్ కుమార్ గుంటూరు వెళ్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడికి పింఛన్ ఇచ్చాడు. పడమటిపాలెం గ్రామానికి చెందిన పాము చిన్న వెంకటేశ్వరరావు కిడ్నీ సంబంధిత వ్యాధితో గుంటూరు జిల్లా వేదాంత ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. చికిత్స పూర్తి అవ్వడానికి కొద్దిరోజుల సమయం పడుతుందని విషయం తెలుసుకున్న సుధీర్ కుమార్ తన సొంత ఖర్చులతో శనివారం అక్కడకు చేరుకుని పింఛన్ సొమ్ము అందజేశారు. సుధీర్ కుమార్‌ను ఎంపీడీఓ దిన తేజ్ అభినందించారు.

### బాలికపై అత్యాచారం

అత్తిలి: మండలంలోని ఈడూరు గ్రామానికి చెందిన పులవర్తి అయ్యప్ప అనే యువకుడు తమ కుమార్తెను అత్యాచారం చేశాడంటూ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వి.రాంబాబు శనివారం తెలిపారు. ఎస్సై రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం రైల్వే స్టేషన్ రోడ్డులో బాలిక తల్లి అద్దెకు ఉంటోంది. ఆమె కుమార్తె ఏడో తరగతి చదివి ఇంటి వద్దనే ఉంటోంది. అయితే అదే భవనంపై అద్దెకు ఉంటున్న పులవర్తి ప్రసాద్ సోదరుడు ఈడూరు గ్రామానికి చెందిన పులవర్తి అయ్యప్ప కింద పోర్షన్‌లో ఉంటున్న బాలిక వద్దకు వచ్చి మాయమాటలు చెప్పి గత నెల 18న, తిరిగి 26న అత్యాచారం చేశాడు. విషయం తెలుసుకున్న బాధితురాలి తల్లి పోలీసులను ఆశ్రయించింది.

# చిరకాల స్వప్నం.. సాకారం

తాడేపల్లిగూడెం అర్బన్: తాను రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి తాను కన్న చిరకాలం నాటి కల సాకారమయిందని తాడేపల్లిగూడెంలో రెవెన్యూ డివిజనల్ కార్యాలయాన్ని (ఆర్‌డీఓ) ఏర్పాటు చేయాలని కోరుకున్న కల ఈనాటికి సాకారమయినందుకు సంతోషంగా ఉందని ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక ఆర్ అండ్‌బీ బంగ్లా ప్రాంగణంలో రెవెన్యూ డివిజనల్ కార్యాలయాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో తాడేపల్లిగూడెంలో ఆర్‌డీఓ కార్యాలయం ఏర్పాటు చేయాలని తాను కోరిన సమయంలో తాడేపల్లిగూడెంలో సంబంధిత కార్యాలయం ఏర్పాటు చేసేందుకు శాఖాపరమైన ఇబ్బందులు ఉన్నాయని చెప్పారన్నారు. అయినా తాను కన్న కల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారని ఆనందం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ మాట్లాడుతూ మండల రెవెన్యూ కార్యాలయం పరిధికి మించి వచ్చిన సమస్యలకు ప్రజలు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్ళాల్సి వచ్చిందేన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి నుంచి విముక్తి లభించిందని తాడేపల్లిగూడెంతో పాటు 5 మండలాలకు చెందిన 6.50 లక్షల మంది ప్రజలు తాడేపల్లిగూడెంలో ఏర్పాటు చేసిన ఆర్‌డీఓ కార్యాలయాన్ని వినియోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ చెన్నయ్య, తహసీల్దార్ బండ్రెడ్డి మురళీకృష్ణ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఓ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కొట్టు, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

# శ్రీవారి కొండపై భారీ చోరీ

**భక్తుడి కారులోని 17 కాసుల బంగారు వస్తువులు మాయం**

ద్వారకాతిరుమల : శ్రీవారి దర్శనార్థం క్షేత్రానికి వచ్చిన ఒక దంపతులు తమ వద్ద ఉన్న 17 కాసుల బంగారు నగలను కారులో ఉంచి, స్వామివారి దర్శనానికి వెళ్లి తిరిగి వచ్చేసరికి ఆ బంగారు నగలు చోరీకి గురయ్యాయి. ఈ ఘటన శనివారం ఉదయం కొండపైన సెంట్రల్ పార్కింగ్‌లో చోటు చేసుకుంది. వివరాలు ప్రకారం విశాఖపట్నం జిల్లా పాత గాజువాకలోని సమతానగర్‌కు చెందిన కిరీటం సత్య భాస్కరరావు, కొత్త అన్నపూర్ణావిశాలాక్షి దంపతులు రావులపాలెంలోని ఒక వివాహ వేడుకకు హాజరై, అక్కడి నుంచి నేరుగా ఉదయం తమ కారులో శ్రీవారి దర్శనం కోసం ద్వారకాతిరుమల క్షేత్రానికి వచ్చారు. తమ వద్ద ఉన్న 17 కాసుల 02 గ్రాముల బరువైన రాళ్ల పొదిగిన రెండు జతల బంగారు చెవి దిద్దులు, రాళ్ల పొదిగిన నాలుగు బంగారు గాజులు, నాలుగు పేటల బంగారు గొలుసు, రాళ్ల పొదిగిన బంగారు నెక్లెస్, ఒక బంగారు హారాన్ని పర్సులో పెట్టి దాన్ని తమ కారు సీటు కింద పెట్టారు. ఆ కారును సెంట్రల్ పార్కింగ్‌లో పార్క్ చేసి దర్శనానికి వెళ్లారు. మధ్యాహ్నం సుమారు ఒంటిగంటన్నర సమయంలో స్వగ్రామానికి తిరుగు ప్రయాణం అయ్యేందుకు కారు ఎక్కిన బాధిత దంపతులకు బంగారు వస్తువులు పెట్టిన పర్సు కనిపించలేదు. ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. భీమడోలు సీఐ భీమేశ్వర రవికుమార్, ద్వారకాతిరుమల ఎస్సై జి.సతీష్ తదితరులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, బాధిత దంపతుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం దేవస్థానం సీసీ కెమేరాల ఫుటేజీలను పరిశీలించారు. సెంట్రల్ పార్కింగ్ లోపల సీసీ కెమెరాలు లేకపోవడంతో దొంగలను గుర్తించడం పోలీసులకు కష్టతరంగా మారింది. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సతీష్ తెలిపారు.



బాధితులు నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్సై సతీష్

# 6న మహిళా దినోత్సవం నిర్వహించుకోవాలి

ఏలూరు(మెట్రో): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్యక్రమాలను ఈ నెల 6న నిర్వహించుకోవాలని ఏపీ ఎన్‌జీఓ ఉమెన్ వింగ్ నాయకులకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సూచించారు. శనివారం కలెక్టర్‌ను ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు ఆధ్వర్యంలో ఎన్జీజీవోస్ ఉమెన్ వింగ్ జిల్లా చైర్ పర్సన్ నాగమణి కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 8న ప్రపంచ మహిళా దినోత్సవం అయినప్పటికీ అదే రోజు మహా శివ రాత్రి సెలవు రావడంతో ఈ నెల 6 వ తేదీన ఏలూరులో పోలీస్ పరేడ్ గ్రౌండ్ కి దగ్గర లో ఉన్న సురేష్ బహుగుణ పోలీసు కల్యాణ మండపంలో మహిళా దినోత్సవం జరుపుకోవాలని కలెక్టర్ ఎన్జీఓ నాయకులకు సూచించారు. ఆ రోజు ఉదయం ఆటల పోటీలు నిర్వహించుకుని సాయంత్రం 4.00 గంటల నుంచి 8.00 గంటల వరకు మహిళా దినోత్సవ కార్యక్రమం జరుగుతుందని మహిళా విభాగం సభ్యులు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమ అనంతరం విచ్చేసిన మహిళా ఉద్యోగినులకు విందు కూడా ఏర్పాటు చేసినట్లు ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కె.సునీత, మల్లిక, సత్యభారతి తదితరులు ఉన్నారు.



ఏపీ ఎన్‌జీఓ నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

### చెరువులో పడి యువకుడి అనుమానాస్పద మృతి

లింగపాలెం: మండలంలోని ఎడవల్లి గ్రామంలో చెరువులో పడి తుమ్మలపల్లి రాజేష్ (చంటి) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. శనివారం సాయంత్రం రాజేష్ మృతదేహాన్ని స్థానికులు చెరువులో గుర్తించి, బయటకు తీశారు. మంచి ఈతగాడిగా గుర్తింపు ఉన్న రాజేష్ చెరువులో పడి మృతి చెందడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజేష్ స్థానికంగా డ్రైవర్‌గా పని చేస్తూ ఉంటాడు. ధర్మాజీగూడెం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రాజేష్ మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.







## గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.